ప్రజాశక్తి
ఆదివారం 21 సెప్టెంబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

పల్నాడులో మిర్చిబోర్డు

- రెండు దశల్లో వరికపూడిసెల నిర్మాణం
- 100 పడకల ఆస్పత్రిని నిర్మిస్తాం
- గ్రేడ్-1 మున్సిపాల్టీగా మాచర్ల - తక్షణం రూ.50 కోట్లు
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-మాచర్ల, పల్నాడు జిల్లా

20 ఏళ్లుగా టిడిపి జెండా ఎగురని మాచర్లలో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని సిఎం చంద్రబాబు హామీనిచ్చారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మాచర్లలో నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు గంటన్నరపాటు మాట్లాడిన సిఎం మాచర్లకు పలు హామీలనిచ్చారు. వరికపూడిశెల, వందపడకల ఆస్పత్రి తదితర సమస్యలను ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రస్తావించగా వాటికి సిఎం చంద్రబాబు స్పందిస్తూ పల్నాడు ప్రజల ఆరు దశాబ్దాల కలగా ఉన్న వరికపూడిసెల ఎత్తిపోతల పథకాన్ని మొదటి దశలో 1.54 టీఎంసీలు, రెండో దశలో 6.32 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తామని చెప్పారు. పల్నాడులో మిర్చి బోర్డు ఏర్పాటు చేస్తామని మాచర్లను గ్రేడ్-1 మున్సిపాలిటీగా, మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని, తక్షణమే రూ.50 కోట్ల మంజూరుతోపాటు 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. కారంపూడి వీరారాధన ఉత్సవాలను ప్రభుత్వం తరపున నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రతిఇంటి నుండి చెత్త సేకరణకు విద్యుత్ వాహనాలను తెస్తున్నామని, చెత్త నుంచి విద్యుత్, కంపోస్టు ఎరువును తయారు చేస్తామని అన్నారు.



మొక్కను నాటి నీరు పోస్తున్న సిఎం చంద్రబాబు

విశాఖ, గుంటూరులో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు పని చేస్తున్నాయని, రాజమండ్రి, నెల్లూరు, కడప, కర్నూలులోనూ ప్లాంట్లు పెడతామని చెప్పారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం కోసం సఫాయి మిత్ర సురక్షిత శిబిరాలు, సంక్షేమ పథకాలు పట్టణ పారిశుధ్య కార్మికులకు బీమా పథకాన్ని ప్రారంభించామన్నారు. వచ్చేనెల 2న 16 విభాగాల్లో 52 రాష్ట్రస్థాయి, 1,421 జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఎంపిక చేసిన బంగారు కుటుంబాల అభ్యున్నతి కోసం ముందుకొచ్చిన మార్గదర్శకులతో మాట్లాడి వారి ప్రణాళికను తెలుసుకున్నారు. బంగారు కుటుంబాలు వారు అభ్యున్నతి సాధించగానే వారుకూడా ఇతర పేదలను దత్తత తీసుకుని మార్గదర్శిగా మారాలని చెప్పారు. స్మార్ట్ ఫోన్‌తో సమయం వృథా చేసుకోవద్దని, మొక్కలు పెంచడం, యోగాకు కొంత సమయం కేటాయించాలని ప్రజలకు సూచించారు.


ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారిగా మాచర్లకు వచ్చిన చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. స్వాగతం పలికిన వారిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, మున్సిపల్ మంత్రి పి.నారాయణ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, కుమారుడు గౌతమ్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు కె.శ్రీధర్, నాయకులు చిరుమామిళ్ల మధు, పంగులూరి అంజయ్య, మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లేశ్వరి మధు, శిల్పకళల చైర్మన్ కల్పనారెడ్డి, యెనుముల కేశవరెడ్డి, సీనియర్ నాయకులు మద్దిగపు పెదవెంకట్రామిరెడ్డి, కొమెర దుర్గారావు, చినవెంకట్రామిరెడ్డి, శౌరెడ్డి గోపిరెడ్డి, ధారూ నాయక్ ఐజి నర్సయ్య, గురవారెడ్డి తదితరులు చంద్రబాబుకు పుష్పగుచ్చాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ బి.కృష్ణారావు, పలువురు అధికారులు స్వాగతం పలికారు. అనతరం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేం దుకు సిఎం చంద్రబాబు యాదవుల బజారుకు తరలివెళ్లారు. సభ అనంతరం టిడిపి శ్రేణులతో సమావేశంలో పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ ప్రాంగణంలో కూలిన వందేళ్ల కిందటి భారీచెట్టు

మళ్లీ ఏకధాటిగా జోరువాన

రహదారులు జలమయం - పలు ప్రాంతాల్లో నిలిచిన రాకపోకలు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు రెండు గంటల పాటు కుండపోతగా వర్షం కురవడంతో రహదారులన్నీ చెరువుల య్యాయి. పలుచోట్ల చెట్లు విరిగి పడ్డాయి. ఇళ్ల, దుకాణాలు, కార్యాలయాల్లోకి నీరు చేరింది. కాలనీలన్నీ తటాకాలను తలపించాయి. ప్రధాన రహదారుల్లో ఎటుచూసిన వర్షపు నీరు భారీగా నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ప్రధాన రహదారుల్లోని లక్ష్మీపురం నుంచి సంగడిగుంట వరకు పారే ప్రధాన డ్రెయిను పీకల వాగు నిండిపోవడంతో మొత్తం డ్రెయినేజి నీరు, వర్షం నీరు కలిసిపోయి రహదారులపై పారింది. జిల్లా పరిషత్ ప్రాంగ ణంలో చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. జిల్లాలోని పలు చోట్ల పిడుగులు పడ్డాయి. భీకరమైన పిడుగుల శబ్దాలతో ప్రజలు భయానికి గురయ్యారు. గుంటూరులోని మూడు వంతెనల రహదారి, కంకర గుంట ఆర్‌యూబి వద్ద నీరు నిలిచింది. మార్కెట్ నుంచి గుజ్జనగుండ్ల వెళ్లడానికి కలెక్టరేట్ రోడ్డులో నీరు ఏరులై పారింది. బ్రాడీపేట 18వ అడ్డరోడ్డు నుంచి కంకరగుంట మార్గంలో పీకలవాడు డ్రెయిన్ పొర్లి దుకాణా ల్లోకి నీరు చేరింది. బ్రాడీపేట ఒకటో లైను మొత్తం, పాత గుంటూరు, సుద్ధపల్లి డొంక రోడ్డు, సంగడిగుంట, లాలాపేట, కొత్తపేట, నెహ్రూనగర్ ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రమైన నరసరావు పేటలో ఏకధాటిగా 3 గంటల వానతో పట్టణం జలమయమైంది. మురుగు కాల్వలు పొంగి నీరు రోడ్లమీదకొచ్చింది. సత్తెనపల్లి రోడ్డు స్టేడియం సమీపంలో పట్టణ ప్రధాన మురుగు కాల్వ పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కోటప్పకొండ రోడ్డు వెంగళరెడ్డి నగర్, లాల్ బహదూర్ కూరగాయల మార్కెట్, నిమ్మతోట, పనసతోట ప్రాంతాలు జలమయమైయ్యాయి. పాత భవనాల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని, కూలే దశలో ఉన్న ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, తహశీల్దార్ కె.వేణుగోపాలరావు సూచించారు.



విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్ వద్ద శనివారం నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి జి.నాగరాజు మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత లేదని, ప్రమాదాలు జరిగితే ఎటువంటి రక్షణా లేని స్థితిలో ఉన్నారని ఆవేదన వెలిబుచ్చారు. తెలంగాణలో కాంట్రాక్ట్ కార్మికులందరినీ ఆర్టిజెన్సీగా మార్చి రూ.46 వేల వేతనం ఇస్తున్నారని, కానీ ఇక్కడ మూడు రకాలుగా కార్మికులను విభజించి రూ.18 వేల నుండి గరిష్టంగా రూ.27 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. కొత్త, పాత కార్మికులందరికీ ఒకే వేతనం

▶ 2లో

మార్పులతో ప్రజలకూ ఇబ్బందులే..

రెండోరోజు నల్ల బ్యాడ్జీలతో దస్తావేజులేఖర్ల నిరసన

-2లో

అదుపు తప్పి ట్రావెల్స్ బస్సు బోల్తా

తృటిలో తప్పిన ప్రమాదం

▶ 3లో

గంజాయి రహిత జిల్లానే లక్ష్యం : ఎస్‌పి

▶ 8లో



అంచలంచెలుగా చేనేత నిర్వీర్యం

- పరిరక్షణ కోసం రాష్ట్ర మహాసభలో కార్యాచరణ
- 6న సత్తెనపల్లిలో భారీ ప్రదర్శన : చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

చేనేత రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంచలంచెలాగా నిర్వీర్యం చేస్తున్నాయని, ఈ నేపథ్యంలో చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాట కార్యచరణను రూపొందిస్తామని సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.బాలకృష్ణ చెప్పారు. స్థానిక ఫణిదం చేనేత సొసైటీ కాలనీలో సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కె.శివ దుర్గారావు అధ్యక్షతన శనివారం జరిగింది. బాలకృష్ణ మాట్లాడుతూ వచ్చేనెల 6, 7 తేదీల్లో సంఘం 11వ రాష్ట్ర మహాసభ సత్తెనపల్లిలో నిర్వహిస్తామని, పోరాట

▶ 2లో



డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో విజయవంతంగా ఇంప్లాంట్ శస్త్రచికిత్స

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో ఇద్దరు చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంట్ స్విచ్ ఆన్ కార్యక్రమం శనివారం జరిగింది. నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారి లేరిన క్లియకు 2 చెవులకు, ఏలూరు జిల్లా పాములవారిగూడెంకు చెందిన ఐదేళ్ల జెస్సికా ప్రదీపకు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేశామని డాక్టర్ వేపూరి రాజేష్ అన్నారు. స్విచ్ ఆన్ కార్యక్రమానికి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్విచ్ ఆన్ చేసి చిన్నారులకు వినికిడి వినిపించగా తల్లిదండ్రులు, హాస్పిటల్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ వందకు పైగా కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌కు గుర్తింపు లభించిందన్నారు. పుట్టుకతో మూగ, చెవుడు ఉన్న ఐదేళ్లలోపు చిన్నారులకు ఎన్టీఆర్ వైద్య సేవ,ఇ.హెచ్.ఎస్ కార్డు ద్వారా కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ ఉపయోగమన్నారు. శస్త్రచికిత్స ద్వారా చిన్నారులకు కొత్త జీవితం సొంతం అవుతుందన్నారు. క్లిష్టమైన చెవి,ముక్కు,గొంతు సర్జరీలు బ్లాక్ ఫంగస్ కేసులను అతి తక్కువ ఖర్చుతో చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

విధుల నుండి ఆయ తొలగింపు

ఆమె భర్తపై చట్ట ప్రకారం చర్యలకు ఆదేశాలు

ప్రజాశక్తి ప్రత్తిపాడు

మండలంలోని రావిపాటి వారిపాలెం ప్రాథమిక పాఠశాలలో చిన్నారి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో పాఠశాల నిందితుడైన సామియేలు భార్య అయిన ఆయ వాసిమళ్ల నాగమ్మను విధుల నుండి తొలగిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సివి రేణుక శనివారం ఆదేశాలిచ్చారు. ఘటనపై ఎంఇఒ సి.హెచ్ రమాదేవి ద్వారా నివేదిక తెప్పించుకుని నిందితునిపై చట్ట ప్రకారం చర్యలకు డిఇఒ ఆదేశించారు.



ఓబీసీలకు 46 శాతం రిజర్వేషన్ల దిశగా కేంద్రం

ప్రజాశక్తి - మంగళగిరి

రాహుల్ గాంధీ దూకుడును ఎదుర్కొనే వ్యూహంలో భాగంగా, కేంద్ర ప్రభుత్వం ఓబీసీలకు వారి జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కల్పించేందుకు కసరత్తు చేస్తోందని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. శనివారం మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ...రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా 42 శాతం రిజర్వేషన్లను చట్టసభలలో అమలు చేయాలని కోరుతున్నా, ఎన్డీఏ ప్రభుత్వం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఓబీసీలకు 46 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సిద్ధమవుతోందని చెప్పారు. మహిళా రిజర్వేషన్ చట్టంలో సవరణలు చేసి, ఓబీసీ మహిళలకు సబ్-కోటా కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయన్నారు. బీహార్ ఎన్నికలకు ముందే 10 లక్షల మందితో భారీ బహిరంగ సభలో ఈ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.క్రాంతి కుమార్, ఎ.నాగమల్లేశ్వరరావు, వి.బి. భాస్కర్‌బాబు, వి.వెంకటేశ్వరరావు, సిహెచ్.చందు, కిరణ్, ఎ.శివాజీ, నాగుల్ మీరా, దానా గౌడ్ పాల్గొన్నారు.

మార్పులతో ప్రజలకూ ఇబ్బందులే..

రెండోరోజు నల్ల బ్యాడ్జీలతో దస్తావేజులేఖర్ల నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి



నిరసనలో దస్తావేజులేఖరులు

రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా తెచ్చిన మార్పుల వల్ల తమతోపాటు ప్రజలు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నదని దస్తావేజులేఖరులు అన్నారు. మార్పులకు వ్యతిరేకంగా రెండ్రోజుల పెన్‌డౌన్‌లో భాగంగా రెండోరోజైన శనివారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్టిఫైడ్ కాపీలు ఆన్‌లైన్‌లో తీసుకునే సందర్భంలో ప్రతి పేజీ డిజిటల్ సైన్‌తో ధ్రువీకరించేలా మార్పు జరగాలన్నారు. జిరాక్స్ కాపీకి, ఆన్‌లైన్ సర్టిఫికెట్ కాపీకి వ్యత్యాసం తెలియడం లేదని తెలిపారు. వృద్ధులకు గతంలో మాదిరిగానే తమ కుటుంబ సభ్యుల పేర అటెస్టేషన్ డాక్యుమెంట్లను మాన్యువల్‌గా చేసుకునే విధానం ప్రజలకు ఉపయోగమన్నారు. ఒటిపి విధానం వల్ల ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని చెప్పారు. దస్తావేజు లేఖరుల లైసెన్సులను మంజూరు చేయాలని, రిజిస్ట్రేషన్ శాఖలో సాంకేతిక సమస్యలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.జయరాజు, పి.ప్రభుదాసు, ఎం.సుధీర్‌బాబు, ఎం.కృష్ణ, టి.కిరణ్, జి.కనకసుందరరావు, ఎస్‌వి.రాజేష్, ఎస్.తిరుపతిరావు, ఆర్.అంకమ్మరావు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతన ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్ల సర్వీసు దాటిన కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఇంక్రిమెంట్లు గతంలో ఇచ్చిన మాదిరిగానే ఇవ్వాలన్నారు. తెలంగాణలో మాదిరిగా రూ.46 వేలు వేతన ఇవ్వాలని,ప్రమాదకర స్థితిలో పనిచేస్తున్న అన్ని రకాల కార్మికులను సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ 'మీ సమస్యలన్నీ నా సమస్యలుగా భావిస్తా'మంటూ హామీనిచ్చారని గుర్తు చేశారు. నేడు అధికారం చేపట్టి ఏడాదిన్నరవుతున్నా సమస్యలేవీ పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ చేయాలని, థర్డ్ పార్టీగా ఉన్న దళారీ వ్యవస్థను రద్దు చేయాలని కోరారు. 2022 పిఆర్సీ బకాయిలు నేటికీ కార్మికులకు చెల్లించలేదని, పదేపదే అడుగుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు ఏరియర్స్ తక్షణమే ఇవ్వాలన్నారు. సిపిడిసిఎల్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జాతీయ, పండుగ సెలవు దినాలకు ఇవ్వాల్సిన బకాయిలు, వేతనాలు తక్షణమే ఇవ్వాలని, కార్మికులందరికీ రూ.కోటి ఇన్సూరెన్స్ అమలు చేయాలని, స్టోర్ హమాలీలు, మీటర్ రీడర్లు, బిల్లు కలెక్షన్ ఏజెంట్లు తదితరులందరికీ పీస్ రేటు కార్మికులందరికీ కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ఈ సమస్యలపై విద్యుత్ యాజమాన్యం తక్షణమే స్పందించి పరిష్కరించకుంటే కార్మికులు భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బొర్రా సురేష్, నాగవంశీ, బాషా, భరత్, తిరుపతిరావు, వేణు, గోపి, సలీం బాషా, వలి, వెంకటేష్, రాంబాబు, సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంచలంచెలుగా చేనేత నిర్వీర్యం

(మొదటి పేజీ తరువాయి)

కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. చేనేత రంగాన్ని కాపాడుతామనే హామీని సిఎం చంద్రబాబు విస్మరించడమే కాకుండా మరింత ధ్వంసం చేసే విధానాలు అనుసరిస్తున్నారని విమర్శించారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమలుకు నోచలేదని, మరోవైపు పవర్ లూమ్ మగ్గాల యజమానులకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తామంటున్నారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు హైటెక్ యుగంలో గుంట మగ్గాలు అక్కర్లేదని చెప్పిన చంద్రబాబు ప్రస్తుత చర్యలు కూడా అలాగే ఉన్నాయన్నారు. 11 రకాల రిజర్వేషన్లను అమలు చేయడం లేదని, ఉల్లంఘించిన పవర్ లూమ్ యజమానులపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ చట్టం ప్రకారం చేనేత దుస్తులనే వాడాల్సి ఉన్నా పవర్లూమ్ బట్టలను వాడుతున్నారని, చేనేత బట్టల ఖర్చును రికార్డులలో రాసి రూ.కోట్ల అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ భాస్కరయ్య మాట్లాడుతూ చేనేత కార్మిక సంఘం మహాసభ ప్రారంభం సందర్భంగా 6న సత్తెనపల్లిలో చేనేత కార్మికులతో భారీ ప్రదర్శన ఉంటుందని, కార్మికులంతా పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.వీరబ్రహ్మం, నాయకులు జి.సుసులోవ్, పి.ప్రభాకర్, బి.పానకాలు, వి.చిన్న దిబ్బయ్య, ఎం.గురవయ్య, ఎం.బాబురాజు, జి.ఏసురత్నం పాల్గొన్నారు.

24 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీటి చేరిక కొనసాగుతుండడంతో శనివారం సాగర్ 24 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,87,344 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి 2,41,831 క్యూసెక్కులు వస్తుండగా ఈ మొత్తాన్ని కిందికి పంపుతున్నారు. కుడికాల్వకు 9,500, ఎడమకాల్వకు 9,076, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,211, ఎస్‌ఎల్బీసీకి 2,400, వరద కాల్వకు 300 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 587.20 అడుగుల వద్ద ఉంది. ఇది 305.6242 టీఎంసీలకు సమానం.



రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎస్ఆర్ఎస్ఎంహెచ్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి - తెనాలి : స్థానిక కొత్తపేట శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం కె.భారతి శనివారం తెలిపారు. బాలికల విభాగం అండర్-14లో తొమ్మిదో తరగతి విద్యార్థిని చంద్రబాను, అండర్-17 విభాగంలో 9వ తరగతి విద్యార్థినులు నందిని, సాహిరా, బాలుర విభాగంలో అండర్-14లో 8వ తరగతి విద్యార్థులు మోహన్, జయకృష్ణ, అండర్-17 విభాగంలో 10వ తరగతి విద్యార్థులు జగదీష్, గణేష్, అండర్-19 విభాగంలో తరుణ్, ప్రసన్న ఎంపికైనట్లు వివరించారు. వీరిని పిఇటిలు టి.ప్రసాదకుమారి, కె.గోవర్ధన, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

వైసిపి వైఫల్యాల వల్ల అభివృద్ధి ఆలస్యం

ఏళ్ల తరబడి ఆగిన ప్రాజెక్టులకు మోక్షం కల్పిస్తాం : కేంద్ర మంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



జిల్లాలో గత ప్రభుత్వం వైఫల్యాల కారణంగా పలు అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విమర్శించారు. రూ.3.48 కోట్లతో స్థానిక బిఆర్ స్టేడియం వద్ద సమీకృత సంక్షేమ హాస్టల్‌ను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వీర బాలాంజనేయ స్వామి, స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలిసి చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ గుంటూరులో గత ఐదేళ్లలో పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వదిలివేసిన అనేక ప్రాజెక్టులను తాము పూర్తి చేస్తున్నామని తెలిపారు. నందివెలుగు ఆర్‌వోబి, బిసి వసతి గృహ సముదాయాలను తామే పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. గుంటూరు మహిళా కళాశాలలో 3 వేల నుంచి 4 వేల మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉండగా గత ప్రభుత్వం అభివృద్ధి చేయలేదన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మాతా శిశు సంరక్షణ కేంద్రంతో పాటు ఇతర విభాగాల్లో మౌలిక వసతులకు రూ.30 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో లైబ్రరీలు, విద్యావనరుల కోసం రూ.10 నుంచి రూ.12 కోట్ల వరుకు ఖర్చు చేస్తున్నట్టు వివరించారు. మూడు వంతెనల బ్రిడ్జ్ నిర్మాణం, డ్రైనేజ్ వ్యవస్థను పునరుద్ధరించడం, గ్రీనరీ, ప్లాంటేషన్లు, పారిశుధ్యాన్ని మెరుగుపర్చడం, తాగునీటి వ్యవస్థను క్రమబద్ధీకరించడం తదితర పనులు చేస్తున్నట్టు తెలిపారు. సంక్షేమం అంటే కేవలం సహాయం చేయడమే కాదని, పేదవాళ్లకు ఆర్థిక స్వాతంత్ర్యం, చదువుకునే అవకాశాలు, ఆరోగ్య సౌకర్యాలు అందించడమే నిజమైన అభివద్ధి అని తెలిపారు. సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌ను సమర్ధవంతంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గళ్ళా మాధవి, బూర్ల రామాంజనేయులు, నక్కా ఆనంద్‌బాబు, నశీర్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ డేగల ప్రభాకర్, రెవెన్యూ డివిజినల్ అధికారి శ్రీనివాస రావు, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి చెన్నయ్య, ఎపిడబ్ల్యూ శైలజ, ఎపి డబ్ల్యూఐజి ఈఈ సంజీవరావు, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదభరితంగా రోడ్డు

ప్రజాశక్తి- మేడికొండూరు

మేడికొండూరు మండలం సిరిపురం గ్రామం నుండి సరిపూడి, వెలవర్తిపాడు, మేడికొండూరు వెళ్లే ఆర్అండ్బి ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇరు వైపులా పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీనితో ఆ రహదారి గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం అనేకమంది ద్విచక్ర వాహనదారులతోపాటు పాఠశాలలకు వెళ్లే స్కూలు బస్సులు వెళ్తుంటాయి. ఈ రోడ్డుకు ఇరువైపులా గుంతలు పడటంతో వాహనాలు రాక పోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రధానంగా రాత్రివేళల్లో గుంటలు ఉన్న ప్రాంతాల వద్ద ప్రమాదాలు జరిగి పలువురుకి గాయాలయ్యాయి. వెంటనే ఆర్అండ్బి అధికారులు స్పందించి ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా నివారించాల్సిందిగా వాహన చోదకులు కోరుతున్నారు.

వర్షపు నీరున్న పొలాలపై నివేదిక

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని శేకూరు, శలపాడు రెవెన్యూ గ్రామాలలో మొత్తం దాదాపు 4000 ఎకరాలలో వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి దాదాపు 30 రోజులపై బడిన దశలో ఉన్నది. ఇటీవల కురిసిన వర్షాలకి నీరునిల్వ ఉన్న పొలాలు దర్శించి, ప్రాథమిక నివేదిక జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి సమర్పించారని మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు ఎం.రామరాజు, రైతులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సు బోల్తా - తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని పొనుగు పాడు-మేరికపూడి గ్రామాల మధ్య గుంటూరు-కర్నూలు రహదారిపై శనివారం తెల్లవారుజామున 4 గంటలకు వినాయక ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల వివరాల ప్రకారం రాజస్థాన్ నుంచి 50మంది భక్తులతో శ్రీశైలానికి వెళ్తున్న బస్సు మేరికపూడి-పొనుగు పాడు మార్గంలో మజ్జిగ వంతెన వద్ద అదుపుతప్పింది. ఈ ప్రమా దంలో బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ఐదుగురికి స్వల్ప గాయాల య్యాయి. గాయపడిన వారిని స్థానికులు ప్రైవేటు వాహనంలో నరసరావు పేటకు తరలించారు.



సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీ లించి వివరాలు సేకరించారు. అయితే ప్రాణ నష్టం జరగకపోవ డంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామానికి చెందిన రామనాథం శ్రీనివాసరావు (50) గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అప్పు తీసుకున్న వ్యక్తి ఇంటికి వెళ్ళి రామనాథం శ్రీనివాసరావు భార్య పూర్ణ కుమారి కుమారుడు వెంకటేష్ గొడవ చేసిన నేపథ్యంలో అప్పు తీసుకున్న వ్యక్తి దాసరి వెంకటేశ్వర్లు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు బెదిరించడంతో భయపడి శ్రీనివాసరావు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయం తెలిసి ఆయన భార్యా కొడుకు బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నారు. శ్రీనివాసరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబం మొత్తం మృతి చెందడంతో కుమార్తె కన్నీరు మున్నీరుగా విలపించడం పలువురిని కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - పొన్నూరు

మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు కోరారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నిడుబ్రోలులో మహిళల కొరకు శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరోగ్య కేంద్రాన్ని పొన్నూరు మున్సిపల్ కమిష నర్ రమేష్‌బాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించరాదని, ఆరోగ్యరక్షణ కొరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. అంగన్వాడి కేంద్రాల వారు మహిళల ఆరోగ్య రక్షణపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ ఫిరోజ్‌బాషా, డాక్టర్లు, సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పుట్టిన 15 రోజులలోపు జనన ధ్రువీకరణ పత్రం తీసుకోండి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

బిడ్డ పుట్టిన 15రోజులలోపు జనన ధృవీకరణ పత్రం తీసుకోవాలని సూపర్‌వైజర్లు గొట్టిపాడు, ప్రత్తిపాడు సెక్టార్ సూపర్ వైజర్లు అన్నారు. శనివారం పోషణ మాశోత్తవం కార్యక్రమంలో భాగంగా కొండేపాడు,చిన్న కొండ్రుపాడు గ్రామలలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. సూపర్‌వైజర్లు మాట్లాడుతూ పిల్లలకు ఆధార్‌కార్డు తప్పనిసరి తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడిలో ఆధార్ నెంబర్ ఉంటేనే అపర్ ఐడి చేయడానికి వీలుంటుందని అన్నారు. కొండేపాడు సర్పంచ్ నర్రా రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు మహాలక్ష్మి, కావ్య, వై.మణి, షేక్ కమలబేగం, ఆషాప్రవీణ్, వై.యశోద, సి.హెచ్. నాగమణి, పద్మ, పిల్లల తల్లులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఇతరులు

శరన్నవరాత్రుల బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు చుట్టుగుంట శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం లో 22వ శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాల బ్రోచర్‌ను శనివారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఈ మహోత్సవాలు ఈనెల 22 నుంచి వచ్చేనెల 2 వరకు వైభవంగా జరగనున్నాయని, పోలేరమ్మ తల్లి గుంటూరు ప్రజల గ్రామదేవతగా భావింపబడి, శక్తి స్వరూపిణిగా ఆరాధన పొందుతోందన్నారు. చుట్టు గుంట దేవాలయం సంస్కృతి, సంప్రదాయా లకు ప్రతీకగా నిలుస్తున్నదని, అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అలంకారాలు, అన్నదానాలు నిర్వహించనున్నారని తెలిపారు.



పుట్టిన వేడుకల్లో ధార్మిక

పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి - పొన్నూరు

బ్రాహ్మణ కోడూరు చైల్డ్‌హోంలో పొన్నూరు పరిసర ప్రాంతాలలో బంట్రోతు నరసింహారావు, కోటేశ్వరమ్మ ముని మనుమరాలు ధార్మిక పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమానికి సహకరించిన ధార్మిక తల్లిదండ్రులు రాజేష్, మమతకి మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షులు తిరుమలశెట్టి ఉమా శంకర్ కార్యదర్శి గుడివాడపవన్ ట్రెజరీ చిలకపాటి సింహాద్రి, మూర్తి పాల్గొన్నారు.

విధులకు ఆటకం కలిగించారని కేసు

ప్రజాశక్తి - తెనాలి

రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలో గ్రామ కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై రూరల్ పోలీసులు కేసునమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని పాత మాలపల్లిలో మురుగునీటి పారుదలకు అడ్డంకులపై వచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీ సెక్రె టరీ ఎ.ఇంద్రజ స్పందించి, వాటిని తొలగిస్తుండగా స్థానికులు దాసరిమోహనరావు, మరికొందరు అడ్డు కున్నారు. దానిపై కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్జీవోస్ తాలూకా యూనిట్ ఎన్నికల నోటిఫికేషన్

ప్రజాశక్తి -మంగళగిరి

ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మంగళగిరి తాలూకా యూనిట్ నోటిఫికేషన్ శనివారం విడుదల చేసినట్లుగా ఎన్నికల అధికారి కే శ్రీనివాసరావు తెలిపారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఆర్.నాగేశ్వరావు, పరిశీలకులుగా శ్రీధర్‌రెడ్డిని జిల్లా కార్యవర్గం నియమించినట్లుగా తెలిపారు. అక్టోబర్ 10వ తేదీన మంగళగిరి తాలూకా యూనిట్ కార్యాలయంలో ఎన్నికలు జరుగుతాయని, నామినేషన్ ప్రక్రియ అక్టోబర్ మూడో తేదీ నుండి ప్రారంభమవుతాయని తెలిపారు. మంగళ గిరి తాలూకా పరిధిలోని ఉద్యోగులందరికీ తెలిపామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక నాజరుపేట బిక్షవతి బజారులో శనివారం సాయంత్రం సుమారు 50 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కోటేశ్వరమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద ఎటువంటి వివరాలు లభ్యం కాకపోవడంతో, హెల్పింగ్ సోల్జర్స్ బృందం సాయంతో మృతదేహాన్ని వైద్యశాల మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరి షత్ అధ్యక్షురాలు షేక్ షహేలా నర్గీస్ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ కె.రవిబాబు, డిప్యూటీ ఎంపీడీఓ సిహెచ్. వెంకటేశ్వర్లు, తహశీల్దార్ జె.ప్రసాద్‌రావు ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. వారితో పాటుగా మండల స్థాయి అధికా రులు మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. సమా వేశంలో మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిం చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచు కున్నారు. మండల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని అధ్యక్షురాలు షేక్ షహేలా నర్గీస్ కోరారు.



టిడిపికి మండల అధ్యక్షుని రాజీనామా

ప్రజాశక్తి - నాదెండ్ల

మర్రి రాజశేఖర్‌ను టిడిపిలో చేర్చుకోవడాన్ని వ్యతిరేకిస్తూ టిడిపి మండల అధ్యక్ష పదవితోపాటు పార్టీలో అన్ని పదవులకూ రాజీనామా చేస్తున్నట్లు బండారుపల్లి సత్యనారాయణ ప్రకటించారు. టిడిపి కార్యక్రమాలతో, ప్రజలతో రాజశేఖర్ వ్యవహరించే తీరుపై అనేక అనుమానాలున్నాయని, ఆయన్ను పార్టీలో చేర్చుకోవడాన్ని సమర్థించలేనని చెప్పారు.



పులిచింతలకు 1,97,431 క్యూసెక్కులు విడుదల

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద కృష్ణా నదిపై నిర్మించిన నాగార్జున సాగర్ టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 గేట్లకు గాను 13 గేట్లను మూడు మీటర్ల మేర ఎత్తి 1,97,431 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఇ వెంకటరమణ తెలిపారు. ఎగువున ఉన్న నాగార్జున సాగర్ నుంచి అదే పరిమాణంలో నీరు వస్తోందన్నారు. రిజర్వాయర్లో 74.50 మీటర్ల మేర నీరుందని, ఇది 6.0350 టీఎంసీలకు సమానమని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి నిలిపి వేశామన్నారు.



కౌల్దార్లకు కార్డులు జారీకి సహకరించండి

ప్రజాశక్తి - పెదకూరపాడు

కౌలురైతులకు గుర్తింపు కార్డుల మంజూరుకు వీఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది సహకరించాలని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ధనలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తేనే వారి పేర్లను ఈ-క్రాప్‌లో నమోదుకు అవకాశం ఉంటుందని, పంటను అమ్ముకోవడానికి వీలుంటుందని చెప్పారు. కార్డుల జారీ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సహకరించాలన్నారు.

పంచాయతీలు ఆదాయాలు పెంచుకోవాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : పంచాయతీల సొంత ఆదాయం వనరులు పెంచేందుకు సర్పంచ్‌లు కార్యదర్శులు దృష్టి సారించాలని డిఎల్‌డిఒ రాజగోపాల్ అన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు సత్తెనపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ మాట్లాడుతూ అధిక రాబడి ఉంటేనే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధి పథంలో పయనించడానికి వీలుంటుందన్నారు. శిక్షణకు ఎంఒటిగా వి.శ్యామ్‌చైతన్య, టిఒటిలుగా షేక్ ఖాదర్‌బాష, ఎ.ఉమా శంకర్ వ్యవహరించారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ టి.శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి షేక్ అజీజుర్ రెహమాన్, జూనియర్ అసిస్టెంట్ విజయసుందర్‌దాస్ పాల్గొన్నారు.



సిఎం పర్యటన చిత్రమాలిక

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు మాచర్లకు శనివారం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. స్థానిక సెయింట్ ఆన్స్ బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణంలో హెలీకాప్టర్ దిగిన ముఖ్యమంత్రికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబుకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, కుమారుడు గౌతమ్‌రెడ్డి కలిపి వినాయకుని ప్రతిమను అందించి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రిని చూసి పాఠశాల విద్యార్థులు కేరింతలుకొట్టగా సిఎం వారి వద్దకు వెళ్లి బాలికలు ఇచ్చిన పూలను తీసుకుని వారితో కొంతసేపు మాట్లాడారు.











ఇద్దరు మున్సిపల్ కార్మికులు మృతి

ప్రజాశక్తి - నరసరావుపేట

మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్న దగిపోగు సునీల్ (40), ఇంజినీరింగ్ విభాగంలో డ్రైవర్‌గా పని చేస్తున్న గిద్దలూరు శ్రీనివాసరావు (45) అనారోగ్యంతో మరణించారు. వీరి భౌతికకాయాలను మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు శనివారం సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపి అండగా ఉంటామని చెప్పారు. మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వ పరంగా రావాల్సి లబ్ధిని త్వరగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. నివాళులర్పించిన వారిలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు సిలార్ మసూద్, నాయకులు వీరకుమార్, జీవరత్నం, పి.ఏసు, సి.హెచ్.వెంకమ్మ, చిన్నవెంకటేశ్వర్లు, యోహాను, షేక్ చిన్న అల్లాభక్షు ఉన్నారు.



బొగ్గరం జెడ్‌పి విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-ఈపూరు

క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలు పొందొచ్చని బొగ్గరం జెడ్‌పి పాఠశాల హెచ్ఎం ఎం.రామారావు అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి, కబడ్డీ క్రీడాకారుడు, గుంటూరు జిల్లా రోప్ స్కిప్పింగ్ కోచ్ కోమటిగుంట శ్రీహరి 30 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను సమకూర్చగా వీటిని శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ వెంకట్రావు, పిఇటి ఎం.వెంకటేశ్వర్లు, ఎన్.ఆంజనేయరాజు పాల్గొన్నారు.



హౌసింగ్ కాలనీలో సమస్యలో కోకొల్లలు : సిపిఎం




కాలనీలో పర్యటిస్తున్న నాయకులు, స్థానికులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి - దుగ్గిరాల

హౌసింగ్ కాలనీకి రావాలంటే చుట్టూ తిరిగి కిలోమీటర్లు నడిచి రావాల్సి వస్తోందని, సినిమాహాలు ఎదురుగా బకింగ్ హాం కెనాల్‌పై బ్రిడ్జి నిర్మించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ తెలిపారు. శనివారం దుగ్గిరాలలోని జగనన్న (హౌసింగ్) కాలనీని సిపిఎం బృందం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను తెలిపారు. కాలనీలోకి రావాలంటే సుమారుగా కిలోమీటర్ చుట్టూ తిరిగిరావాల్సి వస్తుందని, లైట్లు లేక చీకట్లలో ఇబ్బంది పడుతున్నామని, పాములు మండ్రగబ్బలు, కొండచిలువలు రోడ్లు మీద సంచరిస్తున్నాయని, భయాందోళనకు గురవుతున్నామని చెప్పారు. ఈ మధ్య కురిసిన అకాల వర్షాలకు రోడ్లు లేక కాలనీలోనానా అవస్థలు పడుతున్నామని, మంచినీళ్లు ట్యాంకు నిర్మించకుండా వాటర్ పైపులు వేశారని అందువల్ల ప్రయోజనం లేదని కాలనీలో కొన్నిచోట్ల లైట్లు లేవని తెలిపారు. కాలనీలో ఇళ్లు నిర్మిస్తానని ఒక కాంట్రాక్టర్ పేదల వద్ద డబ్బులు వసూలు చేసి నిర్మించకుండా వెళ్లిపోయిన పరిస్థితి ఉందనిన నాయకుల దృష్టికి తీసుకు వచ్చారు. నేతాజీ మాట్లాడుతు తాగు నీరు సక్రమంగా లేకుంటే ఆరోగ్య సమస్యలు వస్తాయని, గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మించి మంచినీటి సమస్యను పరిష్కరిం చాలని, కాలనీలో రోడ్లు నిర్మించాలని వీధిలైట్లు వెంటనే ఏర్పాటు చేయాలని పేదల వద్ద ఇళ్లు నిర్మిస్తానని డబ్బులు వసూలు చేసి ఇల్లు నిర్మించకుండా వెళ్లిన కాంట్రాక్టర్‌ను తీసుకొచ్చి పేదలు ఇల్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ రోడ్లు అస్తవ్యవస్తంగా ఉన్నాయని, చినుకు పడితే నడిచే పరిస్థితి లేదన్నారు. నిధులు కేటాయించి కాలనీని అభివృద్ధి చేయాలని కోరారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు జబ్బులు బారిన పడకుండా ప్రభుత్వం వైద్య సదుపాయాలు కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు జి శ్రీనివాసరావు, వై.ఏసోబు, సురేష్, రేష్మ, జైనాబి పాల్గొన్నారు.

చలో అసెంబ్లీని జయప్రదం చేయండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

నూతన కౌలు రైతులకు చట్టాన్ని తీసుకురావాలని అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 20 వేల రూపాయలు వెంటనే కౌలు రైతులకు జమ చేయాలని, విజయవాడ నుండి అసెంబ్లీకి జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని కౌలు రైతుల సంఘ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని చిలువూరు, కంఠంరాజు, కొండూరు, పెనుమూలి, పెద్దకొండూరు గ్రామాలలో శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ నూతన కౌలు చట్టం తెస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, పాత చట్టం లోపాలను సవరిస్తామని తాము అధికారంలోకి రాగానే భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. ఈనెలాఖరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ముసాయిదా చట్టాన్ని చర్చించి ఆమోదించి కొత్త చట్టాన్ని తీసుకురావాలని కోరారు. సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు ఎన్.రాంబాబు, ఎన్.శ్రీను, బుజ్జి , టి.శ్రీనివాసరావు, బి.అమ్మిరెడ్డి, బుల్లయ్య, మరియదాసు, తదితరులు పాల్గొన్నారు.






తెనాలిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్, తాడేపల్లిలో మొక్కలు నాటుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, తక్కెళ్లపాడులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పరిశుభ్రత పెంపొందించడమే "స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర" లక్ష్యం

ప్రజాశక్తి తెనాలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే "స్వర్ణాంధ్ర స్వచ్ఛంద" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ప్రతి నెల మూడవ శనివారం పట్టణంలో చేపడుతున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమాన్ని స్థానిక చినరావూరు 13వ వార్డులో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక లక్ష్యంతో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావలసిన ఆవశ్యకత ఉందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో కలిసి పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. ప్రజలు కూడా తడి చెత్త - పొడి చెత్తను వేరువేరుగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజన సింహ, తహశీల్దార్ కెవి గోపాలకృఅష్ణ, కమిషనర్ పి.శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో..

స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెం డెంట్ డాక్టర్ టి.సౌభాగ్యవాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కల నాటడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ కె రాజేశ్వరి, గైనకాలజిస్ట్ డాక్టర్ నరేంద్ర సింగ్, పీడియాట్రీషియన్ డాక్టర్ రామాంజనేయులు, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సు, శానిటరీ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా మొక్కలు నాటుదామని, పర్యావరణాన్ని కాపాడుకుందామని మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. శనివారం తాడేపల్లి కొత్తూరులోని బకింగ్ హెూమ్ కెనాల్ కాలవ వెంబడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ "స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర" అనేది రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బృహత్తర కార్యక్రమమని కొనియాడారు. శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీస్ డి.రవికుమార్, షేక్ గౌసియా, మున్సిపల్ సిబ్బంది, ఆర్ పి ఎస్, ఎస్ హెచ్ జి, టీడీపీ నాయకులు దారా దాసు, దానబోయిన సుందరరావు యాదవ్, మేకా పుల్లారెడ్డి, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, కేళి వెంకటేశ్వరరావు, తాడిబోయిన భాస్కర్, తాడిబోయిన గోపి,షేక్ నాగుల్ మీరా, సిహెచ్.రాంబాబు కుసుమ, సైకం నీలిమాదేవి, కృష్ణవేణి, హరికృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని అన్ని గ్రామంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.ఊహరాణి మాట్లాడుతూ సమాజ క్షేమం కోసం, పరిసరాల పరిశుభ్రతలో భాగంగా ఒక ప్రత్యేక థీమ్‌తో ప్రతినెలా మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తక్కెళ్లపాడులో..

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని తక్కెళ్లపాడు గ్రామంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్థానిక శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో హరితాంధ్ర కార్యక్రమంలో భాగంగా చెరువులు, రహదారి వెంట మొక్కలు నాటడం జరుగుతుందని, పచ్చని పరిసరాలు గ్రామ ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు, తహశీల్దార్ పి.కృష్ణకాంత్, మండల వ్యవసాయ శాఖ అధికారి రమణ కుమార్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, సొసైటీ చైర్మన్ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పర్యావరణాన్ని రక్షిస్తాయి

ప్రజాశక్తి - దుగ్గిరాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల వ్యాప్తంగా గ్రీన్ ఆంధ్ర క్లీన్ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా చిలువూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ షేక్ జబీన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు మొక్కలు నాటడం వలన ప్రయోజనాలను ఆమె తెలిపారు మొక్కలు నాటడం వలన పర్యావరణ రక్షణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలువూరు మాణిక్యం ఎంపిటిసి మరియా రోజమ్మ గ్రామ కార్యదర్శి ఎం శరత్ తదితరులు పాల్గన్నారు. తుమ్మపూడి గ్రామంలో సర్పంచ్ షేక్ అజిజున్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలో సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు గ్రామంలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. ర్యాలీ నిర్వహించడంతో పాటు మొక్కల ప్రయోజనాలను విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గూడూరు వెంకటరావు వెనిగళ్ళ కఅష్ణ ప్రసాద్ మరియు బాణావత్ వెంకటేశ్వర నాయక్ ఇన్‌చార్జి ఒపీడీవో వి చంద్రమోహన్ జోగేంద్ర ప్రసాద్ షేక్ నాగూర్ పసుపులేటి రవి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ మండల శాఖ పక్షాన శనివారం ఎంఈఓ -1 ఎస్ అజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ ఎరియర్ బిల్లులు, మెడికల్ రీఎంబెర్స్ మెంట్ బిల్లులు, ఎస్ఆర్ ఎంట్రీలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల సందర్శన సమయంలో ఎంఈఓ-2 ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను భయ భ్రాంతులకు గురి చేసే విధంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు, సహ అధ్యక్షురాలు వై.నాగమణి, జిల్లా కార్యదర్శి సిహెచ్. ఆదినారాయణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అడవి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టి.భాస్కరరావు, నాయకులు బి.జాకబ్, ఎండి ఖాసీమ్, వాహబ్,జె శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఎం.ఉమామహేశ్వరరావు, ఎ.కళ్యాణ్, జీవిత, వి.రామలింగేశ్వరరావు, బి.సుహాసిని, వి.రత్న ప్రియ పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వేను పరిశీలించిన జేసీ

ప్రజాశక్తి - పెదకాకాని

గ్రామాలలో సాంకేతికత పరిజ్ఞానంతో ప్రజల నివాస గృహాలు, భూ స్థలాలు కచ్చితత్వంతో కొలిచి భవిష్యత్తులో ప్రజల మధ్య భూ వివాదాలు లేకుండా చేయడానికి స్వమిత్వ సర్వే దోహదపడుతుందని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ అన్నారు. పెదకాకానిలో శనివారం ఆయన సర్వేను పరిశీలించి నియమిత కాలంలోపు పూర్తిచేయాలని, సర్వేలో



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకాలు

ప్రజాశక్తి - చేబ్రోలు

జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నారాకోడూరులో చదువుతున్న విద్యార్థులు కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబరిచారని ముగ్గురు బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులపే అభినందన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు తెలిపారు. విశాఖపట్నంలో ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన అస్మిత కిక్ బాక్సింగ్ లీగ్ 2025 బి26 ఖేలో ఇండియా పోటీల్లో నారాకోడూరు పాఠశాల విద్యార్థులు కె.నాగ, ఈ మిల్కీ జి.బిందు ముగ్గురు బంగారు పథకం సాధించారాని చెప్పారు. జి,దైవ కృప, ఎస్ తనుశ్రీ, కె.పల్లవి ముగ్గురు సిల్వర్ మెడలు సాధించారని అన్నారు. కోచ్ చెన్న పవన్ కుమార్‌ను దుశావాతో సత్కరించి అభినందనలు తెలియ జేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ చూపటం సంతోషకరమని హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎన్.ఉమామహేశ్వరి సిఎంఎస్ హెూమ్ వార్డెన్ రమేష్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

291వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 291 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కార్మికులు ముసలా సాంబశివరావు, తుపాకుల నాగేశ్వరావు, దామవరపు నాగేశ్వరావు, వై సాంబశివరావు, ఎం.ఆశీర్వాదం ప్రారంభించారు. కార్మికులు సుభాని, ఇస్మాయిల్, యహెూషువ, మహిళలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి, రాజుపాలెం

రాజుపాలెం మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీలోని సఫాయి మిత్రాలకు (శానిటేషన్ వర్కర్స్) రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. 56మంది సఫయి మిత్రాలు హాజరై రక్త పరీక్షలు హిమోగ్లోబిన్, రక్తపోటు, రక్తంలో చక్కెర పరీక్ష, మూత్ర పరీక్షలు, క్షయ పరీక్షలు, మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ రవితేజనాయక్ కాలేయ, మూత్రపిండ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంపిడిఓ వి.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపిడిఓ ముక్కంటి, ల్యాబ్ టెక్నీ షియన్ రమాదేవి, ఆరోగ్య సిబ్బంది, కూటమి నేతలు పులిబండ్ల సాంబశివరావు, జెట్టి కోటేశ్వరరావు, వాసా వెంకటేశ్వర్లు, దూడుకు రామారావు, జలపాటి సోమయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పెదకూరపాడు

పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ షేక్ పెద్ద ఇమాంబి కోరారు. శనివారం మండలంలోని లగడపాడులో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ భాగ స్వామ్యం కావాలన్నారు. మంచి ఆహారం తీసుకుంటూనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్వాడి కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

విద్యార్థులలో సృజనాత్మకతను, సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్ దోహదపడుతుందని సత్తెనపల్లి తహశీల్దార్ కె.చక్రవర్తి అన్నారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో పాఠశాల నిర్వహణ సంఘం సమావేశం శుక్రవారం రాత్రి జరిగింది. అనంతరం తహశీల్దార్ అటల్‌టింకరింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జగదీశ్‌కుమార్ గుప్తా విఎంసి సభ్యులు, ఆహ్వానితులను పాఠశాలలో జరుగుతున్న పురోగతిశీల కార్యక్రమాలు, విజయాలు గురించి అవగాహన కల్పించారు. చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి పిల్లల సమగ్రాభివృద్ధి కోసం ఆటస్థలం ఏర్పాటు చేయబడిందని గ్రీన్‌స్కూల్ ఇనీషి యేటివ్, పర్యావరణ పరిరక్షణ, హరిత చైతన్యాన్ని ప్రోత్సహిం చడానికి పాఠశాల అనేక కార్యక్రమాలను ప్రారంభించినట్లు చెప్పారు. సత్తెనపల్లి రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ వెంకటరెడ్డి, ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ బోసుబాబ, పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గిరి బలిజ జీఓను రద్దు చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి ప్రభుత్వం దమ్మిరి కులస్తుల గుర్తింపు మార్పులకు తెచ్చిన గిరి బలిజ జీఓ నెం 5 రద్దు చేయాలని మిత్రమండలి నాయకులు అధ్యక్షులు పోతంశెట్టి రామ మోహనరావు సభ్యులు నాగరాజు, జయరాం, అద్దేపల్లి ఆనందబాబు గుప్తా శ్రీకాంత్, రుద్ర చౌడయ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో రాయలసీమలో రెడ్లను సైతం కాపు అనిచేరుస్తూ ఇచ్చిన జీవో ప్రకారం ఇప్పటికే కాపులకు ఉన్న అవకాశాలను కాపు కులస్తులకు సంపూర్ణంగా అందట్లేదనే భావనలో కాపు సమాజం ఉందన్నారు. ఇప్పుడు బలిజ కులస్తులు అదే ఆవేదనకు గురవుతున్నారన్నారు. దమ్మిరి కులస్తులకు మరోక గుర్తింపు ఇవ్వాలని కోరారు. తెలగ, కాపు, బలిజ కులస్తులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారేఅవకాశం ఉందన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

యేసుతో సహవాసం గ్రూపు సభ్యులు ప్రార్థించే పెద్దవులు కన్నా, సాయం చేసే చేతుల మిన్న అనే మదర్ థెరిసా సూక్తిని ఆదర్శంగా తీసుకుని శనివారం పట్టణంలో పలువురు నిరుపేదలకు నెలకు సరిపడా నిత్యావసర సరు కులు పంపిణీ చేయడం అభినందనీయమని న్యాయవాది మాదాసు భాను ప్రసాద్ అన్నారు. పేదలకు 25కిలోల బియ్యం 23 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆర్థిక సహకారం అందించిన గ్రూపుసభ్యులు రూత్, మహిమ కుమారి దాతృత్వాన్ని భానుప్రసాద్ కొనియాడారు. జాన్ వెస్లీనిస్థానిక పాస్టర్ ప్రసన్నబాబు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.


పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


సత్తెనపల్లిలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ....


వినుకొండలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ క్వార్టర్స్ సమీపంలో ఉన్న చెత్తను ఆయన తొలగించారు. అనంతరం ఆర్ అండ్ బి బంగ్లా సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మన్యం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో,పట్టణ ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం సమయంలో ప్రజల అప్రమత్తంగా ఉండి పరిశీలన శుభ్రం చేసుకోవాలని ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు, చెత్తాచెదారాలు ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురజాల నియోజకవర్గం పరిశీలకులు కల్లం రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు, మున్సిపల్ అధికారులు కూటమి ప్రభుత్వ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెదకూరపాడు మండల తహశీల్దార్ ఎన్.ధనలక్ష్మి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలు శుభ్రం చేశారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చును అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి అత్తిమలరమేష్, పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, ఈవో పి ఆర్ డి శరత్, ఇంకా పలువురు నాయకులు అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్‌ప్లాస్టిక్ నివారణకు బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని 16వార్డులో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వీధులను శుభ్రం చేశారు. పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో చెత్తపై పన్ను వేశారని కూటమి ప్రభుత్వం అధికారంలోకిరాగానే పన్నుతొలగించిందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు రూ. కోటి ప్రమాద బీమా కల్పించిందని తెలిపారు. కాలుష్యనివారణకు మొక్కనునాటాలన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఆస్పత్రి ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మొక్కలు నాటారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. పారిశుద్ధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆస్పత్రి ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, బీజేపీ నాయకులు మేడంరమేష్, కూటమి నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ బత్తుల విక్రమ్‌కు సన్మానం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఇటీవల విజయవాడలో మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి బోధిధర్మ అవార్డు అందుకున్న న్యూ షావోలిన్ కుంగ్‌ఫు అకాడమీ, సి.ఆర్ క్లబ్‌మాస్టర్ బత్తుల విక్రమ్‌ను ఫోటోగ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ శనివారం సన్మానించారు. సీనియర్ ఫోటోగ్రాఫర్ నూతనకమిటీ ప్రెసిడెంట్ జె.అభిరామ్‌మాట్లాడుతు ఫోటోగ్రాఫర్ విక్రమ్ పట్టణంలో డిజిటల్ స్టూడియో నిర్వహిస్తూ తన వృత్తితో పాటు ప్యాషన్‌గా నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్‌లో ఉన్నత స్థాయికి ఎదిగి ఎంతో మంది విద్యార్థులకు ఉచితంగా సెల్ఫ్‌డిఫెన్స్‌లో శిక్షణ ఇస్తున్నారని అన్నారు. మార్షల్ ఆర్ట్స్‌లోనే ఆది గురువు బోధి ధర్మ పేరు మీద అవార్డును సాధించడం గర్వకారణ మనారు. అసోసియేషన్ సభ్యులు, ఫోటో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

మహానటుడు ఏఎన్ఆర్

ప్రజాశక్తి - క్రోసూరు

తెలుగు జాతి గర్వించదగ్గ మహానటుడు అక్కినేని నాగేశ్వరావు అని గంటసాల కళ సమితి గౌరవ అధ్యక్షులు శిఖా శాంసన్ అన్నారు. శనివారం అక్కినేని నాగేశ్వరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పల్నాడు జిల్లా క్రోసూరు అమరావతి బస్టాండ్‌లోని ప్రయాణికుల ప్రాంగణంలో శిఖాశాంసన్ పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం మాట్లాడుతూ తెలుగుచలనచిత్ర సీమలో వైవిధ్య మైన అధ్యాయం అక్కినేని అన్నారు తెలుగు సినిమా చరిత్రలో ఒకసారి కొత్త అధ్యాయాన్ని సృష్టించి తెలుగు ప్రేక్షక అభిమానుల ఆదరణ చూరగొన్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కళా సమితి కార్యదర్శి షేక్ మస్తాన్, కూనాల నాగరాజు, షేక్ జానీబాష పాల్గొన్నారు.

టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు మండల టిడిపి నాయకుడు బండారు రాము తండ్రి బండారు వెంకట్రావు (75) శనివారం తెల్ల వారుజామున మృతి చెందారు. ఆయనకు కుమారుడు, కుమార్తె, భార్య ఉన్నారు. ఆయన తెదేపా క్రియాశీలక సభ్యు డుగా, తెదేపా నాయకుడు పని చేసియున్నారు. బండారు వెంకట్రావు మృతి విషయం తెలిసిన పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కుటుంబ సభ్యులను ఫోను ద్వారా పరామర్శించి సంతాపం తెలిపారు. కంచేటిసాయి, కాంట్రుకూశయ్య, మొగల్‌జాను, నజలాల కోటి యార్డుచైర్మన్ జాని, గుడిపాడుబాషా, వెంకట్రామిరెడ్డి, డి.యోహాను, సలాం, సీతారెడ్డి, పి.రాంబాబు, షేక్‌మస్తాన్, బయ్య వరపు మస్తాన్‌రావు, చిల్కారవి, చిల్కారాంబాబు పాల్గొన్నారు.

దసరా నవరాత్రుల బుక్ లెట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం మల్లమ్మసెంటర్లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి 130వ దసరాశర న్నవ రాత్రుల ఉత్సవ బుక్‌లెట్‌ను మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరి నారాయణ, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ప్రారంభించారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన అధ్యక్షులు కొత్త మాను మెహర్‌బాబు, ప్రధాన కార్యదర్శి కొత్తమాసు వెంకటప్పయ్య, ట్రెజరపోత్తూరి వెంకటలక్ష్మి వరప్రసాదరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


బస్‌షెల్టర్, సీసీరోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేచే బస్‌షెల్టర్, సీసీరోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

యడ్లపాడు మండలంలోని దింతెనపాడు గ్రామంలో శనివారం శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పర్యటించారు. గ్రామంలో నిర్మించిన బస్‌షెల్టర్, సీసీరోడ్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.5 లక్షలతో నిర్మించిన బస్‌షెల్టర్, రూ.15లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించామన్నారు. టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జవ్వాజి మదన్‌మోహన్, మార్కెట్‌యార్డ్ వైస్‌చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు పోపూరి వెంకయ్య, కందిమళ్ల రఘురామారావు, సర్పంచిచౌదరి, అత్తోట శ్రీను, చంద్రకళ పాల్గొన్నారు.

డాక్టర్ ఆదిత్యకు అభినందనలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఎక్సలెంట్ బిజినెస్ అవార్డును అమూల్య నర్సింగ్ హోమ్ వైద్యులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తనయుడు డాక్టర్ ఆదిత్య బాబు ఎంపికయ్యారు. ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ బీసీ సెల్‌అధ్యక్షులు మడకశివప్రసాద్, మండలం అధ్యక్షులు దాసరి నరసింహరావు, ప్రధాన కార్యదర్శి వీరప్పయ్య, పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేశ్వర్లు, బాలు, బీసీ సెల్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

రవికుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పల్నాడు జిల్లా వర్ధమాన రంగస్థల పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్ రంగస్థల ప్రవేశం చేసి నేటికి పదేళ్లు పూర్తి అయిన సందర్భంగా రవికుమార్‌కు సహ కళాకారులు, మిత్రులు శ్రేయోభిలాషుల సమక్షంలో స్థానిక వడ్డపల్లి కృష్ణుడు ఆలయంలో సన్మానం చేశారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు విశ్రాంతి ఉపాధ్యాయులు కోటగిరిపోతులూరయ్య అధ్యక్షత వహించారు. పంచాయతీ కార్యదర్శి గిరీష్‌రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. పట్టణ ప్రముఖ న్యాయవాది కళాకారుడు పిన్నమనేని పాములయ్య, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి జక్కుల లక్ష్మీనారాయణ ప్రధాన అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తదుపరి రవికుమార్‌కి పాములయ్య పోతులూరయ్య, లక్ష్మీనారాయణ రవికుమార్‌ని శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. గిరీష్‌రెడ్డి, దూపాటి నాగేశ్వరావు, శ్రీనివాసు, అంజలికోటేశ్వరరావు, పాత్రికేయుడు వెంకటేశ్వరరావు మాట్లాడారు. రవికుమార్ అందరికి కృతజ్ఞతలు తెలిపారు. అంజలికోటేశ్వరరావు వందన సమర్పణ చేసారు.

రక్తదానం సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - పెదకూరపాడు

రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ అంద్ర ప్రసాద్ అన్నారు. స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విద్య, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి అత్తిమల్ల రమేష్, పలువురు సీనియర్ నాయకులతో కలసి ప్రసాద్ శనివారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అతివల ఆరోగ్య రక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రక్తహీనత, క్యాన్సర్ బారిన పడకుండా స్వస్థనారి కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛభారత్‌లో భాగంగా మొక్కలు నాటారు. నేతలు భాష్యం ఆంజనేయులు, బెల్లంకొండ రామ్‌గోపాల్‌రావు, వడ్లమూడిఅప్పారావు, గల్లా బాబురావు, మద్దినేని సత్యం, మక్కెనసాగర్, పాటిబండ్ల యోహాన్, జె.ప్రసాద్, సరిపూడి గోపి, జాగర్ల మూడి రఘు, అజీముల్లా, కె.సుధాకర్ గంగినేని లీలావతి, ముంతాజ్, సరిపూడి కృష్ణకుమారి, కావూరి సుజాత పాల్గొన్నారు.

స్వచ్ఛత పక్వాడ అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్వచ్ఛత పక్వాడ 2025లో భాగంగా ఈనెల16 నుంచి 30వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం పోలిరెడ్డి పాలెం లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు జై.హైమావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల ఆవాస ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణ, పాఠశాల ఆవాసంలో మొక్కలు నాటడం, వేస్ట్ మెటీరియల్ తొలగించారు. మున్సిపల్ ప్రాథమిక పాఠశాల పోలిరెడ్డి పాలెం ఉపాధ్యాయులు, పి. శైలజ, పోటు, శ్రీనివాసరావు జి.ఆదిలక్ష్మి కె.అరుణ సిహెచ్ నవ్యశ్రీ పాల్గొన్నారు.

ప్రమాదపు అంచున ప్రయాణం

నీటమునిగిన అండర్ పాస్ బ్రిడ్జి - ప్రత్యామ్నాయం లేక ప్రజల నరకయాతన


నీటి మునిగిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి



ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం మండలం, నుదురుపాడు గ్రామం నుంచి రేగులగడ్డ కండ్రిక, బేతపూడి, ఎర్రగుంట్లపాడు వంటి గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా నీరు నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైపులు పగిలి నీరు నిలిచి పోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గత రాత్రి కురిసిన భారీ వర్షానికి బ్రిడ్జి కింద సుమారు ఆరు అడుగుల మేర నీరు నిలిచిపోయిందని స్థానికులు తెలిపారు. చిన్నపాటి వర్షం వచ్చినా లేదా వర్షం లేకపోయినా కూడా పైపులు పగిలి ఉండటం వల్ల నీరు నిల్వ ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఈ ప్రాంతం నుంచి వెళ్లే విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లలేక చదువులు మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అండర్ పాస్ మార్గం మూసుకుపోవడంతో, ప్రజలు, విద్యార్థులు ప్రాణాలకు తెగించి నుదురుపాడు రైల్వే బ్రిడ్జి కింద ఉన్న వాగు ప్రవాహం గుండా వెళ్తున్నారు. ఈ ప్రత్యామ్నాయ మార్గం అత్యంత ప్రమాదకరంగా ఉందని, కొంచెం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, అండర్ పాస్ బ్రిడ్జిలోని నీటిని తొలగించి, ప్రయాణానికి అనువుగా మార్చాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు, విద్యార్థులు, రైతులు, రైతు కూలీలకు మరొక ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిచ్చి అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిరంగిపురంలో 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర'

ప్రజాశక్తి - ఫిరంగిపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమం శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తహశీల్దార్ జె.ప్రసాదరావు ఇతర రెవెన్యూ సిబ్బందితో కలిసి కార్యాలయ ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించారు. అందరూ ఉత్సాహంగా పాల్గొని పరిసరాలను పూర్తిగా శుభ్రం చేశారు. తహశీల్దార్ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

గుండాలపాడులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మండలంలోని గుండాలపాడు గ్రామంలో నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో గర్భిణీ మహిళలకు, బాలింతలకు, మహిళల్లో వచ్చే క్యాన్సర్లకు సంబంధించిన వైద్య పరీక్షలు, శిశువులకు టీకాలు కిషోర్ బాలికల అవగాహన, కంటి పరీక్షలు, దంత పరీక్షలు వంటి అన్నీ వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ యానీ గ్రేస్, సిహెచ్‌ఓ ఎన్.వెంకటలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ కె.సుదర్శన్ రాజు, సర్పంచ్ కాండ్రు దాసయ్య, ఆళ్ల కృష్ణమూర్తి, షేక్ బికారి సాహెబ్, ఎస్.ప్రసన్నకుమార్, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు కిశోర బాలికలు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - పొన్నూరు

ఆధునిక భారత నిర్మాత, దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూను ఫ్యూడల్ అంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని పొన్నూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అందే దిలీప్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నెహ్రూను ఫ్యూడల్ గా అభివర్ణించటాన్ని తప్పుబట్టిన దిలీప్ - చంద్రబాబు చరిత్రకు వక్రభాష్యం పలికి నెహ్రూపై నిందలు మోపి సానుభూతి రాజకీయం చేసే నాయకుల వరుసలో చేరారని విమర్శించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మల సి.బి.ఎస్.ఈ స్కూల్ 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను శనివారం అందజేశారు. ప్రిన్సిపాల్ శిరీష రాణి మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా 2024-2025 10వ తరగతి విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉత్తీర్ణత విద్యార్థుల సర్టిఫికెట్లు అందక విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు వారి విద్యా సంవత్సరం ఎక్కడ ఇబ్బందికి గురవుతుందోనని ఆవేదన చెందారని తెలిపారు. డిప్యూటీ డీఈఓ శాంత కుమారి మాట్లాడుతూ గతంలో ఇచ్చిన సర్టిఫికెట్లు కనిపించకపోవడంతో పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వారికి డూప్లికేట్ సర్టిఫికెట్లు తెప్పించి అందిస్తున్నామని, ఇవి ఒరిజినల్‌గానే పనిచేస్తాయన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగవని తెలిపారు.

చేనేతకు పూర్వ వైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న నందం అబద్దయ్య

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేత కార్మికులను ఆదుకునేందుకు వారి వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు, వారికి ఆదాయం మార్గాలు పెంచేందుకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. శనివారం స్థానిక రాజీవ్ గఅహకల్ప రోడ్‌లోని కమ్యూనిటీ హాలులో జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మంగళగిరి చేనేత స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం క్రింద కార్మికులకు అవగాహన సదస్సు జరిగింది. అబద్దయ్య మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర చేనేత నాయకులు గుత్తికొండ ధనుంజయరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేందుకు రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ నిరంతరం శ్రమిస్తున్నారని చేనేతకు పూర్వవైభవాన్ని తీసుకురావాలని ఆశయంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు సి.హెచ్. సాయిప్రసాద్, టిటిడి ట్రస్ట్ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పడవల మహేష్, రాష్ట్రం తెలుగు మహిళ కార్యదర్శి వింజమూరి ఆశాబాల, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కారంపూడి అంకమ్మరావు, జిల్లా పద్మశాలి సాధికార కమిటీ అధ్యక్షులు బట్టు సదానంద శాస్త్రి, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు వంగర హనుమాన్, పట్టణ మాజీ అధ్యక్షులు దామర్ల రాజు, ఊట్ల శ్రీమన్నారాయణ, చేనేత పారిశ్రామిక వేత్త పాట్లాబత్తుని లక్ష్మణరావు, శివాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు జంజనం వెంకట సుబ్బారావు, ఆకురాతి నాగేంద్రం, మునగాల ప్రసాద్, జిల్లా చేనేత జౌళి శాఖ అధికారులు రాజ వర్ధన్, శ్రీధర్ రాఘవరావు, ఉమామహేశ్వరరావు, విజయవాడ వీవర్స్ సర్వీస్ సెంటర్ అధికారి ఢిల్లీ రావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు


జ్ఞాపికలను అందజేస్తున్న నిర్మల జూనియర్ కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - మంగళగిరి

క్రమశిక్షణతో విద్యార్థులు విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు అధిరోహించవచ్చునని నిర్మలా జూనియర్ కళాశాల డైరెక్టర్ వి.వి.ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక విజెపి అండ్ డి ఎల్ బి డిగ్రీ, నిర్మల జూనియర్ కళాశాలలో ప్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరి పరిసర ప్రాంతాల్లో 31 సంవత్సరాలుగా మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విద్యను అందిస్తున్నామని అన్నారు. సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వి.వి.జవహర్‌లాల్ మాట్లాడుతూ విద్యార్థులు నేటి సమాజంలో ఉన్న వేగాన్ని అందిపుచ్చుకోవాలంటే కష్టపడి చదివి విద్యనభ్యసించాలని కోరారు. జూనియర్ ఇంటర్‌లో అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజెపి అండ్ డి ఎల్ బి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాస్, నిర్మల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ వి.సౌజన్య, విష్ణు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.మనోజ్ కుమార్, వి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత నైపుణ్యాలు పెంచుకోవాలి


వెంకటరమణను సన్మానిస్తున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి

ప్రజాశక్తి - పెదకాకాని

విద్యార్థులు వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకుంటే విజయాలు సాధించవచ్చని స్కైడ్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటరమణ కురుహూరి తెలిపారు. స్థానిక వివిఐటి యూనివర్శిటీలో విద్యార్థులకు కెరీర్ ఎంపిక, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, అనుభవాలు, వృత్తిపరమైన లక్ష్యాలను సాధించడానికి తీసుకోవలసిన దశలపై శనివారం సదస్సు నిర్వహించారు. వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలలో రాణించాలంటే కమ్యునికేషన్, విలువలతో కూడిన విద్య, వ్యక్తిగత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కోర్ విభాగాలైన ఈఈఈ, సివిల్, మెకానికల్ విద్యార్థులకు భవిష్యత్తుతో మంచి అవకాశాలు రానున్నాయని, వాటికి తగ్గట్లు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలతో సన్నద్ధం కావాలని అన్నారు. వివిఐటి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు వెంకటరమణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిఐటియు రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ అద్దంకి, ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆఫీసర్ డాక్టర్ యు.మాధవ్, ఆధ్యాపకులు పాల్గొన్నారు.


తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి - మంగళగిరి

హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార కేంద్రాల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా హెచ్చరించారు. ఎంటీఎంసీ పరిధిలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లతో పాటు పలు ఆహార కేంద్రాల్లో కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారుల శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీంబాషా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. నిర్వాహకులు తప్పనిసరిగా పరిశుభ్రత, నాణ్యతతో పాటు పారిశుధ్య ప్రమాణాలను పాటించాలన్నారు. పౌరులు ఎక్కడైనా హోటళ్లలో అపరిశుభ్రమైన పరిస్థితులు గమనించినట్లయితే కార్పొరేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కమిషనర్ అలీం బాషా కోరారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఆపాలి

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని గాంధీ ఇర్విన్ పార్క్ రైతు బజార్ వద్ద సైడ్ కాలువలపై మున్సిపాలిటీ షాపుల నిర్మాణాన్ని ఆపాలని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం కోరింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు దరిశి శివ కోటేశ్వరరావు మాట్లాడుతూ సైడ్ కాలువలలో పూడిక తీయడానికి వీలు లేకుండా షాపుల నిర్మాణం తగదన్నారు. ఇలాంటి నిర్మాణాలు పట్టణంలో ఎక్కడైనా జరిగితే ఆపాల్సిన మున్సిపల్ అధికారులే సైడ్ కాలువలపై షాపులను నిర్మించడం తగదని, పూర్తిగా చట్ట విరుద్ధమని చెప్పారు. కార్యక్రమంలో అబ్దుల్ ఆరిఫ్, నారాయణం కమల కుమార్, రావూరి శివశంకరరావు, ఎల్.చిరంజీవి, సోమయ్య శాస్త్రి, సత్యనారాయణ, మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పొన్నూరు

వాసవి క్లబ్ జోనల్ చైర్మన్ అధికార పర్యటన లో భాగంగా స్థానిక నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు జోన్ చైర్మన్ ఆకి కిషోర్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ పొన్నూరు వారి ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తుమ్మలమెంటు బావన్నారాయణ, అధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్, సెక్రటరీ పల్లపోతు గణేష్ కుమార్, ట్రెజరర్ పోలిశెట్టి విజయ్ కుమార్, గోద్రెజ్ శివ, హైస్కూల్ హెచ్‌ఎం లాజర్ బాబు, అవ్వారు వెంకటేశ్వరరావు వాసవి క్లబ్ సభ్యులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమైతే ఉలేమ అధ్యక్షుడిగా షేక్ రహంతుల్లా

ప్రజాశక్తి - పొన్నూరు

జమైతే ఉలేమ పొన్నూరు అధ్యక్షుడిగా షేక్ రహంతుల్లా (గోల్డ్) ఎన్నికయ్యారు. పొన్నూరు పట్టణంలో మర్కస్ మసీదు నందు ముఫ్తీ బసీద్ సాహెబ్ పర్యవేక్షణలో జమతే ఉలేమ పొన్నూరు మండలం ఎన్నికలు శనివారం నిర్వహించింది. అధ్యక్షుడుగా షేక్ రహంతుల్లా, వైస్ ప్రెసిడెంట్ మౌలానా అబ్దుల్ సాహెబ్, మునజిరుల్ ఇస్లాం సాహెబ్ ఎన్నికయ్యారు.

పద్మశ్రీ అవార్డుకై కలెక్టర్‌కు వినతి...

ప్రజాశక్తి మంగళగిరి

పద్మశ్రీ అవార్డు-2026కు తమ పేరును సిఫార్సు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా కు ఆంధ్రప్రదేశ్ చర్మ కార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు వినతి పత్రం అందజేశారు. గుంటూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను ఆయన శుక్రవారం కలసి వినతి పత్రం అందజేశారు. 40 ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీ ప్రజల సమస్యలతో పాటు చర్మకారులు, డప్పు కళాకారుల సమస్యలపై పని చేస్తున్నానని, తమ సేవలను గుర్తించి పద్మశ్రీ అవార్డుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫార్సు చేయాలని పేర్కొన్నారు.

గంజాయి రహిత జిల్లానే లక్ష్యం : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గంజాయి విక్రయం, వినియోగం, సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. గంజాయి మూలాలను కూకటివేళ్లతో పెకలించి వేసే దిశగా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. గడచిన రెండు రోజుల్లో సుమారు 3.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని 22 మంది నిందితుల అరెస్ట్ చేసినట్టు తెలిపారు. క్షేత్ర స్థాయిలో ముమ్మర దాడులతో పాటు అవగాహన కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. గంజాయి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై ప్రత్యేక నిఘాతో పాటు పీడీ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. గంజాయి మహమ్మారిని కూకటివేళ్లతో పెకలించి, నిర్మూలించడానికి పటిష్ట ప్రణాళికలు రూపొందించామని, పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక పోలీస్ బృందాలను నియమించి గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.



రేరా సభ్యుడు శ్రీనివాసరావు అభినందన సభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రేరా సభ్యులుగా నియమితులైన దామచర్ల శ్రీనివాసరావుకు స్థానిక కొమ్మినేని గార్డెన్స్‌లో శనివారం అభినందన సభ జరిగింది. ఈ సభలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ టిడిపిలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. రియల్టర్లు, బిల్డర్లు కలిసి ప్రజలకు మేలు చేయాలన్నారు. రేరా అథారిటీ వీరికి సహకరించాలన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, తెనాలి శ్రావణ్‌కుమార్, గళ్ళా మాధవి, నశీర్ అహ్మద్, ప్రత్తిపాటి పుల్లారావు, బి.రామాంజనేయులు,రేరా చైర్మన్ ఎ.శివారెడ్డి, మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ సజీల తదితరులు పాల్గొని శ్రీనివాసరావును అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు దంపతులను పెమ్మసాని, ఆలపాటి, ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించారు.

ప్రపంచ టాప్ సైంటిస్టులలో విజ్ఞాన్ అధ్యాపకులకు చోటు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీకి చెందిన 6గురు అధ్యాపకులు వరల్డ్ టాప్ 2శాతం సైంటిస్ట్‌లలో చోటు సాధించారని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగ భూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నిర్వహించిన సర్వేలో విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీకు చెందిన ప్రొఫెసర్ అంబటి రంగారావు, డాక్టర్ కే.చంద్రశేఖర్, ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డాక్టర్ రుద్రపాల్ మిథున్, అడ్వాన్స్ సీఎస్ఈ విభాగానికి చెందిన డాక్టర్ జోత్స్నాదేవి బోడపాటి, కెమికల్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ టీ.సుబ్బయ్య, హైదరాబాద్‌లోని ఆఫ్ క్యాంపస్ మెకానికల్ విభాగానికి చెందిన డాక్టర్ ఎండీ రహమాన్ వరల్డ్ టాప్ 2శాతం సైంటిస్ట్‌లలో నిలిచారని తెలిపారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ వారు ఆగస్టు 2025 సంవత్సరం వరకు ఉన్న ఉత్తమ సైంటిస్ట్‌ల డేటాను తీసుకోవడంతో పాటు స్టాండర్డ్ సైన్స్ మెట్రిక్స్ క్లాసిఫికేషన్‌లో గల 44 సైంటిఫిక్ ఫీల్డ్స్, 174 సబ్ ఫీల్డ్స్‌ను పరిగణలోనికి తీసుకుని ఈ ఫలితాలను వెల్లడించారన్నారు. అందులో భాగంగా రీసెర్చ్‌వర్క్, రీసెర్చ్ పబ్లికేషన్స్, హెచ్ ఇండెక్స్, సైటేషన్స్, రీసెంట్ పబ్లికేషన్స్, ఇతరత్రా పబ్లికేషన్స్‌లలో ఈ 6గురు అధ్యాపకులు ప్రచురించిన పేపర్లన్నింటిని కూడా పరిగణలోనికి తీసుకుని వరల్డ్ టాప్ 2శాతం సైంటిస్ట్‌లలో గుర్తించారని వెల్లడించారు.ఆయా అధ్యాపకులను విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావురత్తయ్య తదితరులు అభినందించారు.



అధ్యాపకులతో వీసీ

ఘనంగా తులసి యోగీష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

తులసి సీడ్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షులు తులసి యోగీష్ చంద్ర జన్మదిన వేడుకలు శనివారం అరండల్ పేటలోని యోగిభవన్‌లో ఆఫీస్ సిబ్బంది, అభిమానులు, శ్రేయోభిలాషుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య, తోట రామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, దాసరి వాసు, మిరియాల శ్రీనివాస్, బొక్కిసం శివారం, దళవాయి సుబ్రహ్మణ్యం, పుచకాయల ఆనంద్, సుప్రీమ్ సర్జికల్స్ జవహర్ తదితరులు హాజరై అభినందనలు తెలియజేశారు. ఎంతో కాలంగా తమ సంస్థలో పనిచేస్తూ సంస్థలను ముందుకు నడిపిస్తున్న తులసీ ఉద్యోగులందరూ తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానని అటువంటి వారి సమక్షంలో తన పుట్టినరోజు వేడుకలు జరుపుకోవటం చాలా ఆనందంగా ఉందని తులసి యగీష్ అన్నారు. కార్యక్రమంలో లక్ష్మీశెట్టి నాని, డేగల లక్ష్మీనారాయణ, పోలీస్ అధికారుల సంఘం మనికే లక్ష్మయ్య, పసుపులేటి రమణయ్య పాల్గొన్నారు.



అతివృష్టితో అల్లాడుతున్న జనం

అతివృష్టితో జిల్లా వాసులు అల్లాడుతున్నారు. ప్రధానంగా అధిక వర్షాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలో 70 వేల ఎకరాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎటువంటి సాయం అందలేదు. రెండు సార్లు ప్రాథమిక దశలోనే పైర్లు నీట మునిగి ఎందుకు పనికిరాకుండా పోయినా ప్రభుత్వం ఇంత వరకు ఆర్థిక సాయం అందించలేదని రైతులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం పంట ఎదుగుదల దశలో ఉండి 33 శాతంకు పైగా ఉత్పత్తికి నష్టం వస్తేనే పరిహారం వస్తుందని అధికారులు చెబుతున్నారు. కానీ ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు ఖర్చు పెట్టి రెండు సార్లు వెదపద్ధతిలోసాగు చేసిన రైతులకు పైర్లు ఎందుకు పనికిరాకుండా పోయినా ఎటువంటి పరిహారం ఇచ్చేది లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. దీనిపై నిబంధనలు సడలించి రైతులకు సాయం చేయాలని జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై వత్తిడి తేలేకపోయారు. సెప్టెంబరు నెలలో 20 తేదీ నాటికి సగటున 106 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 180 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. చేబ్రోలు, కాకుమాను, దుగ్గిరాల, గుంటూరు పశ్చిమ, పెదకాకాని, పత్తిపాడు, మేడికొండూరు, దుగ్గిరాల, కొల్లిపరలో ఈ నెలలో ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు అయింది. ఈ మండలాల్లో ఈనెలలో కురవాల్సిన వర్షం కన్నా రెట్టింపు వర్షపాతం నమోదు అయింది. దీంతో పైర్లకు ముంపు సమస్య వెంటాడుతుంది. పంట కాల్వలకు సకాలంలో మరమ్మతులు జరగకపోవడం వల్ల ఈ ఏడాది స్వల్ప వర్షాలకే పొలాల్లో నీరు నిలిచిపోతోంది. రెండు మూడు రోజులు పొలాల్లో నీరు నిలవడం, ఈ నీరు బయటకు పోయే లోగా మళ్లీ భారీ వర్షాలకు కురవడం వల్ల రైతులు పైర్లను నిలదొక్కుకునేలా చేయడానికి అష్టకష్టాలు పడుతున్నారు. గత నెల 13,14 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షాలకు జిల్లాలోని కొల్లిపర,దుగ్గిరాల, పెదకాకాని, చేబ్రోలు మండలాల్లో దాదాపు 70 వేల ఎకరాల్లో వరి పైరు నీట మునగగా రైతులు ఎక్కువగా నష్టం జరగ్గా ఈనెల మొదటి వారం నుంచి మూడో వారం వరకు కుండపోతగా కురుస్తున్న వర్షాలతో రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఆగస్టు,సెప్టెంబరునెలల్లో కొల్లిపర, చేబ్రోలు, పెదకాకాని, దుగ్గిరాల మండలాల్లో భారీ నుంచి అతిభారీ వర్షం కురవడం వల్ల పైర్లకు ముంపు సమస్య వెంటాడుతోంది. మరో వర్షాలతో పట్టణ వాసులే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు దెబ్బతింటున్నాయి. పారిశుధ్యం దుర్భరంగా మారడం, వర్షం నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండటం వల్ల దోమల బెడద పెరిగింది. వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రధానంగా గుంటూరు పరిసర ప్రాంతాల్లో డయేరియా సమస్యతో ఇప్పటి వరకు 80 మంది వరకు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేశారు. గుంటూరులో తాగునీటి కలుషితం వల్ల ఎక్కువ మంది డయేరియా బారిన పడ్డారు. కొంత మంది ఆహార పదార్థాల స్వీకరణ వల్ల కూడా డయేరియా బారిన పడ్డట్టు అధికారులు చెబుతున్నారు. గుంటూరు నగరంలో పల్లపు ప్రాంతాలు అధికంగా ఉండటం, కొత్తగా ఏర్పడిన కాలనీల్లో డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడం, మెరుగైన ప్రాంతాల్లో కూడా డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడం వల్ల చిన్నపాటివర్షంకు ముంపు సమస్య వెంటాడుతుంది.

వీక్షణం

(ఎవిడి శర్మ)

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల భాగస్వామ్యం

- ఈగల్ టీం ఐజి రవికృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ఐ.జి ఏ.రవి కృష్ణ అన్నారు. చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం యాంటీ డ్రగ్స్ అండ్ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఈగల్ టీం ఐ.జి ఏ.రవికృష్ణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎమ్. జగదీశ్వరి, డిఎస్పీ జి.భానోదయ పాల్గొని డ్రగ్స్ వాడకం వల్ల, ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలను, చట్టాలు, శిక్షల గురించి వివరించారు. రవికృష్ణ మాట్లాడుతూ భారత దేశాన్ని ప్రేరించే ప్రతి వ్యక్తి డ్రగ్స్‌కి దూరంగా వుండాలని, డ్రగ్స్ వాడకం ఉగ్రవాదానికి పరోక్ష సహకారం అందిస్తుందని, అనేక దేశాలు సింతటిక్ డ్రగ్స్ ద్వారా ఆయుధాలకు నిధులు సమకూర్చుకుంటున్నాయని అన్నారు. డిఎస్పీ జి.భానోదయ మాట్లాడుతూ కళాశాలల్లో 'సేఫ్ క్యాంపస్ జోన్' ఏర్పాటుకు క్లబ్‌లు స్థాపించుకోవాలని సూచించారు. జడ్జి ఎమ్.జగదీశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అతి వేగం ప్రమాదానికి దారితీసినట్టే, అతి ఉత్సాహం కూడా బాధలు మిగులుస్తుంది అన్నారు. అనంతరం డ్రగ్స్ నిరోధానికి విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐజి రవికృష్ణ తదితరులు

సుమేధ హైస్కూల్లో పర్యావరణంపై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌జిఓస్ కాలనీలోని సుమేధ హైస్కూల్లో శనివారం విద్యార్థులకు పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ, అటవీశాఖ ముఖ్య సలహాదారు కొమెర అంకారావు పాల్గొని విద్యార్థులకు పర్యావరణ అవగాహన, మొక్కల పెంపకం యొక్క ప్రాముఖ్యత ను తెలియచేస్తూ వివిధ మొక్కల ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ విత్తన బంతులను తయారు చేసి ఖాళీ సమయాలలో వనాలలో వాటిని చల్లి అడవుల పెంపకానికి పర్యావరణ సంరక్షణకు తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ మొక్కల ప్రేమికుడు చెలికాని సీతారామయ్య, వెంకటేశ్వరరావు, కంభంపాటి గోపాలకృష్ణ మూర్తి, స్కూల్ ప్రిన్సిపాల్ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రాల సంరక్షణకు జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి-గుంటూరు

రేపటి తరానికి బాధ్యత వహించే విద్యార్థినులు తమ నేత్రాల సంరక్షణపై శ్రద్ధ వహించాలని మాక్స్ విజన్ ఐ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి అన్నారు. శ్రీ అభయహస్త షిరిడి సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట బీహెచ్ కాలేజీలో హనుమయ్య హైస్కూల్, జూనియర్ ఇంటర్ విద్యార్థినులకు మాక్స్ విజన్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ కండ్లకలక, కళ్ళ దురదలు, మసకబారటం, దగ్గర, దూరపు చూపు సంబంధం ఇబ్బందులు కలిగినప్పుడు వెంటనే నేత్ర వైద్యుని సంప్రదించాలని కోరారు. ట్రస్టు నిర్వాహకులు షేక్ ముజీర్ ప్రసంగించారు.కార్యక్రమంలో ఐ క్యాంపు కన్వీనర్ అంజన, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.సుమతి, ఉన్నత పాఠశాల తెలుగు, ఇంగ్లీష్ మీడియం హెచ్ఎం సీత, సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సవాలుగా అల్జీమర్స్

ప్రజాశక్తి-గుంటూరు

అల్జీమర్స్ వ్యాధి నేడు దేశంలో ప్రధాన ప్రజారోగ్య సవాలుగా మారిందని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ అన్నారు. ప్రపంచ అల్జీమర్స్ డేని పురస్కరించుకొని స్థానిక లలిత గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లోని న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యూరాలజీ మరియు సైకియాట్రీ విభాగాల ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ డిమెన్షియా గురించి వివరించారు. దేశంలో 60 ఏళ్ళు పైబడిన వారిలో సుమారు 7.4శాతం డిమెన్షియాతో బాధపడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధి 2030 నాటికి రెండింతలు, 2050 నాటికి మూడింతలు అవుతుందని గణాంకాలు చెబుతున్నాయని, ప్రపంచవ్యాప్తంగా ప్రతి 3 సెకండ్లకు ఒకరు ఈ వ్యాధి బారిన పడుతున్నా రన్నారు. అల్జీమర్స్ ఒక ప్రధాన ప్రజారోగ్య సవాలుగా మారిందని పేర్కొన్నారు. మెదడు ఆరోగ్యం గురించి అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని, రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంచడం, నిత్య శారీరక వ్యాయామం చేయడం, కూరగాయలు, పండ్లు, సిరి ధాన్యాలు అధికంగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. పొగ త్రాగటం, మద్యపానం మానివేయాలని, చదవడం, పజిల్స్, ఆటలు, కొత్త విషయాలు నేర్చుకోవడం ద్వారా మెదడుకు వ్యాయామం ఇవ్వడం కుటుంబం, స్నేహితులతో సమాజంలో కలిసిపోవడం, ప్రతిరోజూ తగినంత నిద్రపోవడం శరీర బరువును నియంత్రించడం ,ధ్యానం, యోగా, విశ్రాంతి పద్ధతుల ద్వారా ఒత్తిడి తగ్గించడం వంటివి అవలించటం ద్వారా డిమెన్షియా ప్రమాదం నుండి తప్పించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ వీరమ్మ డిమెన్షియా లక్షణాలు, డాక్టర్ రేష్మ రిస్క్ ఫ్యాక్టర్స్ గురించి వివరించారు. డాక్టర్ ఉష కిరణ్, డాక్టర్ అజ్మా, డాక్టర్, డాక్టర్ ఎస్. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ విజయ